
# మల్లెపొదలు

జి.సి.జీవి




అందాన్ని అందరూ ఇష్టపడతారు.

చాలా మంది ఆరాధిస్తారు.

కొందరు మాత్రం దానికి దాసోహమై బానిసలై పోతారు.

నేనీ చివరి కోవకి చెందినవాణ్ణి.

పదేళ్ళ కిందట ఒకానొక లేత సంధ్య వేళ అరకు లోయలో కొండల్లో, కోనల్లో ఏకాకినై విహరిస్తున్నప్పుడు ఎదురైంది ఆ అసమాన సౌందర్యమూర్తి. ఆమె కన్ను లలో కదలాడిన ఆ నీలి నీడలు నన్ను విభ్రాంతుడ్ని, పిచ్చివాడిని చేసినయ్.

"నన్ను పెళ్ళి చేసుకుంటావా?" డొంకతిరుగుళ్ళు, వుపోద్ఘాతాలు లేకుండా సూటిగానే అడిగాను.

నా కౌగిలిలోంచి పక్కకి వొదిగి వెల్లికలా పడుకున్నప్పుడు ఆమె వీపు కింద ఎండుటాకులు గలగల మన్నాయ్. ఆ గలగలలో కలిసిపోయింది ఆమె నవ్వు కూడా.

"తమాషా కాదు. నిజంగానే అడుగుతున్నాను. నాతో వొచ్చెయ్ నిన్ను పెళ్ళాడుతాను" అన్నాను ఆమె నడుం మీద చేతులు వేసి.

కళ్ళు టపటపలాడిస్తూ నాకేసి చూసింది నమ్మ లేనట్టుగా.

"పోనీ నిన్ను పెళ్ళి చేసుకుని నాతో తీసుకువెడతాను సరేనా?"

"మరి నన్ను నమ్ముకున్న మా వాళ్ళంతా ఏం కావాలి?" అంది తన భాషలో, తన యాసలో.

"నువ్వే పోషిస్తుంటావా వాళ్ళని? ఏం చేస్తుం టావు?"

"ఇక్కడికొచ్చే మీలాంటి వాళ్ళకి అందాన్ని, ఆనం దాన్ని పంచుతుంటాను" ఎంతో నిర్భయంగా, సూటిగా చెప్పింది! ఆమె మీద అసహ్యం కాదు నాకు ఆరాధనే కలిగింది.

"ఈ అడవిలో తేనె సేకరిస్తుంటాము అప్పుడప్పుడు జింకల్ని, కుందేళ్ళని వేటాడి మా వాళ్ళకి మాంసం వండిపెడుతుంటాము. ఇంకా ఇలాంటివే..."

ఆ లోయలో గల గల పారే సెలయేటి వొడ్డున చీకటి గుహలోని రాతి దేవుని యెదుట ఒకానొక సంధ్య వేళ దివిటీల వెలుగులో వాళ్ళ పద్ధతిలోనే ఆమెని భార్యగా స్వీకరించాను.

మా పూర్వీకులు జమిందారీ వంశానికి చెందిన వాళ్ళట. నన్ను కన్నవాళ్ళు కొన్ని లక్షలు విలువ చేసే ఆస్తిని, చుట్టూ రకరకాల చెట్లు, పూల పొదలు వున్న ఒక చిన్న సైజు కోట లాంటి భవంతిని నాకొదిలి మొదటిసారి విమానం ఎక్కి మళ్ళీ తిరిగి రాలేదు. అందుచేత నా భార్యని నమ్ముకున్నవాళ్ళకి వాల్తేరులో ఓ పెద్ద ఇల్లు, వాళ్ళు కోరిన వ్యాపారం, ఇతర సదు పాయాలు కల్పించి, నా భార్యని నాతో తెచ్చేసుకోవడం నాకేమీ కష్టమనిపించలేదు.

దాదాపు అయిదు సంవత్సరాలు ఆమె నా అర్ధాంగి. నా దగ్గర చదువు, సాంఘిక మర్యాదలు నేర్చుకునే శిష్యురాలు. ఈ అయిదేళ్ళలో నేనే పోల్చుకోలేనంతగా మారిపోయింది ఆమె.

ఇప్పుడు కాక్ టైల్ కలపడం ఎలాగో నాకంటే నా భార్యకే బాగా తెలుసు. సోషల్ గేదరింగ్స్‌లో "హా దు యుడు" అని విలాసంగా అంటున్నప్పుడు అంతా ఆమెకేసి ఆరాధనగాను, నాకేసి అసూయతోను చూడడం నాకు బాగా గుర్తు.

నేను సహజంగా ముభావిని. స్నేహితులు, పరిచయస్థులు అంతంత మాత్రమే. ఆమె ప్రవేశంతో పరిస్థితి మారిపోయింది. కోటలాంటి మా భవంతిలో తరచుగా ఏదో ఒక పార్టీ జరుగుతుండేది. సినిమా డైరెక్టర్లు మొదలుకుని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ల దాకా ఎవ రెవరో హాజరయ్యేవాళ్ళు. అంతవరకు మరుగునపడి వున్న నా సోషల్ స్టేటస్ వెలుగులోకి వచ్చింది. ఇదంతా నా భార్య ప్రభావమేనని వేరే చెప్పనవసరం లేదు.

క్రమంగా ఆమె నాకు దూరమవుతున్నదన్న భావన నాలో వేళ్ళూని మొలకెత్తి పెరగసాగింది. దీనికి తోడు నేను ఊళ్ళో లేని సమయంలో మేముంటున్న

ప్రాంతానికి పాతిక కిలోమీటర్ల దూరంలో వున్న సిటీకి వెళ్ళి ఫైవ్‌స్టార్ హోటల్స్ గదుల్లో ఆమె గడిపి వస్తోందన్న సంగతి నాకు చూచాయగా తెలియవచ్చింది. ఒకటి రెండుసార్లు నేను కళ్ళారా చూశాను కూడా.

నాలోని బాధని, ఆవేశాన్ని, ఆగ్రహాన్ని అణగదొక్కుకొని వీలైనంత నెమ్మదిగా, నాజూకుగా, నాగరికంగా హెచ్చరించి చూశాను.

"నేను లేనప్పుడు ఒంటరిగా సినిమాకి వెళ్ళావా?" అని నేనడిగినంత తేలిగ్గా తీసుకుంది. మెడ వెనక్కి వాల్చి, స్లీవ్‌లెస్ భుజాలెగురవేసి నవ్వేస్తూ "నా ఈ సౌందర్యం, యవ్వనం అంతా నీ ఒక్కడిదే అనుకోవడం స్వార్థం కాదూ. అయినా నాకిదేమీ కొత్త కాదని నీకు మాత్రం తెలీదా ఏమిటి? పెళ్ళికి ముందు డబ్బుకోసం, ఇప్పుడా అవసరంతో మాత్రం కాదు. అంతే తేడా" అంది.

ఆమెతో వాదించి లాభం లేదని తెలిసిపోయింది.

ఆమెకి తెలుసు నా బలహీనత. ఆమె సౌందర్యానికి నేను దాసుడ్ని అని, ఆమెని నేనేమీ చెయ్యలేనని కూడా తెలుసు ఆమెకి.

ఆమెలో మార్పు రాకపోతుందా అని కొన్నాళ్ళు ఓపికతో ఎదురు చూశాను. మార్పు వచ్చింది. అయితే అది నేను కోరుకున్న మార్పు మాత్రం కాదు. నేను



ఊహించని మార్పు. నేను లేనప్పుడు సిటీకి వెళ్ళి హోటల్ గదుల్లో గడపాల్సిన అవసరం కూడా లేకుండా దిన్నగా ఇంటికే ఆహ్వానించడం ప్రారంభించింది తనకి ఇష్టమైనవాళ్ళని. ఇంట్లోని నౌకర్లు నన్ను చూసి చాటుగా నవ్వుకోవడం, జాలిగా చూడడం నాకు తెలుస్తూనే వుంది.

ఆ రోజు-

నేను ఊరి నుంచి తిరిగొచ్చి మేడ మెట్లెక్కుతున్నాను. మా పడగ్గదిలోంచి అప్పుడే డాక్టర్ బయటికొస్తూ కనిపించాడు. ఒక్క క్షణం చిరు నవ్వుతో శుభాకాంక్షలు చెప్పి మెట్లు దిగి వెళ్ళి పోయాడు. గదిలో మంచం మీద వెల్లకిలా పడుకుని వుంది ఆమె. పైట చెదిరి నేల మీదికి జీరాడు తున్నది. చీర కుచ్చెళ్ళు చెదురులై బొడ్డు కనిపిస్తున్నది పాలమరగలా.

"ఏమిటలా చూస్తావ్? డాక్టర్ నన్నేమీ చెయ్యలేదులే. పరీక్ష చేసి వెళ్ళాడు అంతే" అని నవ్వింది.

"ఒక గుడ్ న్యూస్ చెప్పనా? నీకో వారసుడు రాబోతున్నాడు. నాకు మూడో నెల. రా, వచ్చి ఇలా కూర్చో" అంటూ పక్కకి ఒత్తిగిలింది.

అదిరి పడ్డాను. మూడో నెల! నేనామెని ముట్టుకుని ఆర్నెల్లు కావస్తున్నది.

నాకు తెలీకుండానే నా కళ్ళు ఎరుపెక్కినయ్.

"ఎందుకలా చూస్తావ్? నువ్వు నన్నేమీ చెయ్యలేవు. నన్నొదిలి వుండడం నీ వల్ల కాదు.యు స్టిల్ లవ్ మి. డోంట్ యు?" కిందికి వేలాడే పైటని గుండెల మీదికి లాక్కుంటూ అన్నది.

ఆ రాత్రి చాలాసేపటి దాకా ఆలోచిస్తూనే వుండి పోయాను.

సహనానికి ఒక హద్దు వుంది.

అవమానానికి కూడా ఒక అంతున్నది.

ఆమెను వదలి నే నుండలేను! నిజమే.

కాని ఆమె లేకపోతే?

ఆమెను వదలి వుండే ప్రసక్తే వుండదు.

వాల్తేరు నుంచి టెలిగ్రాం వచ్చింది- వాళ్ళనాన్నగారికి సీరియస్ ఆసుపత్రిలో చేర్చారని.

"వెళతావా" అడిగాను.

"వెళ్ళమంటావా?"

"వెళ్ళకపోతే బాగుంటుందా? కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని రావడం మంచిది"

ఆ రోజే నౌకర్లందరికీ వారం రోజులు సెలవు మంజూరు చేశాను. ఆర్నెల్లకోసారి అలా చేయడం నాకు అలవాటు. ఆ రాత్రి రైలుకి వాల్తేరుకి ఒక టికెట్ బుక్ చేయించాను. స్టేషన్ బయటే ఒకరిద్దరు పరిచయస్తులు ఎదురయ్యారు.

"మా ఆవిడ్ని పుట్టింటికి పంపుతున్నాను"

"ఈయన తండ్రి కాబోతున్నారు" చెప్పింది ఆమె నవ్వుతూ-

"వెరీగుడ్! కంగ్రాట్స్" అని వెళ్ళిపోయారు వాళ్ళు.

ఆమె వెనకే కంపార్టుమెంటు ఎక్కి జేబులో చెయ్యి పెట్టాను టిక్కెట్ కోసం. పర్సు లేదు. కంగారుగా అన్ని జేబులూ వెతికాను.

"ఏమైంది?" అడిగింది.

"పర్సు కనిపించడం లేదు. టికెట్ అందులోనే వుండిపోయింది."

"అసలు పర్సు తెచ్చారా?"

"తెచ్చాను. బాగా జ్ఞాపకముంది. టాక్సీకి డబ్బులు కూడా అందులోంచి తీసిచ్చాను. ఇంతలో ఎవరో కొట్టేసినట్టున్నారు" అన్నాను రుమాలుతో ముఖానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ.

"అయ్యో! ఇప్పుడెలా?" అడిగింది.

"ఇంటికి తిరిగి వెళ్ళాల్సిందే. రేపు వెళుదువుగాని దిగు."

వేరే గేటుగుండా ఇద్దరం స్టేషన్ బైటికి వచ్చాము. సన్నగా ప్రారంభమైన తుంపర ఇంటికి చేరుకునే సరికి పెద్ద వర్షంగా మారింది. రోడ్డు మీద జన సంచారం లేదు. వీథిలో దీపాలు కూడా వెలగడం లేదు. ఇంట్లోప లికి వెళ్ళి బీరువా తెరిచి డబ్బులు తీసి టాక్సీకి పే చేసి పంపేశాను.

మెట్లెక్కి పైకి వెళ్ళాను.

గదిలో మంచం పక్కన నిలబడి చీర మార్చు కుంటూ కనిపించింది.

పొట్ట దగ్గర మూడో నెల ఎత్తు కనిపించీ కనిపించ కుండా వుంది. ఫ్యాను గాలికి అందంగా ఎగిరిపడే ఆ ముంగురులు నన్ను ఆహ్వానిస్తున్నట్టుగా వున్నాయి. రవికె తీసేసి మంచం అంచున పడేసింది. బ్రాలోంచి పొంగిన ఎత్తులు నన్ను రెచ్చగొట్టినయ్. కొద్ది క్షణాల తరువాత మంచం మీద వెల్లికిలా ఆమె. ఆమె మీద బోర్లా నేను. చాలా కాలం తరువాత ఆమె చేతులు బలంగా నా వీపుని పెనవేసుకుంటున్నాయ్.

నా చేతిని మృదువుగా నిమురుతూ తన పొట్ట దాకా తీసుకువెళ్ళింది.

తగిలీ తగలని ఆ ఎత్తు మెత్తగా తగిలింది.

ఆ వర్మం కింద అప్పుడప్పుడే ప్రాణం పోసు కుంటు న్న బిడ్డ... నాది కాని బిడ్డ...!

నాది కాని శిశువుని మోసే ఈమె నా దవుతుందా? నన్ను తనకేసి గట్టిగా అదుముకుంటోంది ఆమె. ఆమె కన్నులలో కోటి కోరికల నీలి నీడలు ఎవరి బిడ్డకో నన్ను తండ్రిని చేసి నవ్వుతున్నాయి.

ఆమె జుత్తు నిమురుతూ నా చేతుల్ని మెడ దగ్గరికి జార్చాను.

ఆమె కాళ్ళు నా కాళ్ళని తమకంతో చుట్టివేస్తు న్నాయి.

మెల్లగా నా చేతులు మృదువైన ఆమె మెడ మీద బిగుసుకోసాగినయి. ముందు విస్తుపోయి చూసింది.

ఆకాశం ఫెళఫెళమని ఉరిమింది.

భయం భయంగా చూసింది నా కళ్ళలోకి. ఆ కళ్ళలో కదలాడిన భీతి నన్ను మరింత గా గొట్టింది.

నాలో ఏదో పైశాచికానందం.

గింజుకుంది. మృదువైన పాల రాయిలాంటి ఆమె మెడ మీద నా అరచేతులు కర్కశంగా బిగుసు కుంటు న్నయ్.

క్షణాల అనంతరం ఒకనాటి నా సౌందర్యరాశి నిశ్చలనమైపోయింది.

బయట వర్షం తగ్గుముఖం పట్టింది. నిర్జీవమైన ఆమె పెదాలని చివరిసారిగా చుంబించి వీడ్కోలు పలికాను. మెట్లు దిగి కిందికి వెళ్ళాను. పాత గోనె సంచి వెతికి తెచ్చాను.

ఆమె శరీరం ఇంకా బిగుసుకోలేదు.

వర్మం కింద నెత్తురు ఇంకా వెచ్చగానే వుంది. ఆ శరీరాన్ని గోనెసంచిలోకి కుక్కడం కష్టమనిపించలేదు. తల మాత్రం బయటికి తొంగి చూస్తూన్నట్టుంది. మెడని గట్టిగా లోపలికి అదిమి పట్టి గోనె మూతి బిగించి తాడుతో గట్టిగా కట్టాను.


పదకొండు గంటలు దాటింది. కిటికీలోంచి చూశాను. కాంపౌండు గోడకవతల రోడ్డు మీద జన సంచారం బొత్తిగా లేదు. వర్షం మాత్రం ఇంకా చితచితమని పడుతూనే వుంది.

గోనెసంచిని మేడ మెట్ల మీదుగా దొర్లించుకుంటూ వెళ్ళాలనుకున్నాను. కాని అందమైన, సుకుమారమైన ఆ శరీర అవయవాలు నా కళ్ళ ముందే టపటపని విరిగి పోవడాన్ని నేను సహించగలనా అనిపించింది. ఆలోచిం చాను. పెరట్లో నూతి దగ్గరకి నడిచి గిలక, చేంతాడు విప్పి మేడ మీదికి తెచ్చాను. బాల్కనీ గోడకి వున్న కొక్కికి గిలకని తగిలించి చేంతాడు దూర్చాను. గోనె సంచీకి చేంతాడు కొన వుచ్చులా బిగించి కట్టాను. గిలకే మించి మెల్లగా గోడకి ఆమె శరీరం తగలకుండా అతి జాగ్రత్తగా గోనెసంచిని కింద తోటలోకి దింపగలిగాను.

గుబురుగా పెరిగిన మల్లెపొదల కింద, వర్షంలో తడిసిన నేల మీద గడ్డపారతో నాలుగడుగుల గోతిని తవ్వడం కష్టమనిపించలేదు.

వారం రోజుల తరువాత పోలీసు కంప్లెయింటిచ్చాను- వార్తేరుకి రైలెక్కిన ఆమె అక్కడికి చేరనే లేదని, ఏ విధమైన ఆచూకీ తెలియలేదని. పత్రికల్లోను, టి.వి. లోను ప్రకటనలిచ్చాను. మొదట్లో కొన్ని రోజుల్దాకా ఎవరెవరో వచ్చి నాకు సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పి, పరామర్శించి వెళ్ళేవారు. ఆ తరువాత క్రమంగా ఒంటరితనానికి అలవాటు పడిపోయాను. ఒకరిద్దరు తప్ప తక్కిన నౌకర్లని పంపేశాను. నా ఇంట్లో నేనే ఒక బందీలా గడపసాగాను.

> "పండుగకి రమ్మని నీ మామగారు ఉత్తరం వ్రాసి క్రింద ఒక చిన్న మాట వ్రాశారని అన్నావ్. ఏంటా మాట?"
>
> "పండుగ ఖర్చులకి అడ్వాన్స్‌గా వెయ్యి రూపాయిలు మనిఆర్డర్ చేయాలట."
>
> —పి. విమల

విస్కీ సీసాలు, సిగరెట్ పేకెట్లు నా నేస్తాలు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు, కొన్ని నెలలు గడిచిపోయినయ్.

టెలిఫోను మోగింది.

వాచీ చూసుకున్నాను. గంట పదిన్నరైంది. గ్లాసులో మిగిలిన విస్కీని ఒక్క గుక్కలో ఖాళీ చేసి, రిసీవరెత్తి "హలో" అన్నాను.

"నేను ఊర్వశిని. నిద్రపోయారో లేక ఇంకా మేలుకునే వున్నారోనని ఫోను చేశాను" అవతలి వైపు నుంచి తీయని గొంతు.

"నేను నిద్రపోయి చాలా కాలమైంది" అన్నాను.

"ఇక నుంచి మీకు నిద్రకి కరువుండదు. మిమ్మల్ని హాయిగా నిద్రపుచ్చే పూచీ నాది. రమ్మంటారా?"

"పది గంటలకల్లా ఇక్కడుంటానన్నావు" అన్నాను కొంచెం కోపం నటిస్తూ.

"సారీ కొంచెం లేటైపోయింది. ఢిల్లీ నుంచి ఎవరో వి.ఐ.పి.లు వచ్చారు. వాళ్ళకి స్పెషల్ రూములు అవీ ఏర్పాటు చేయడంలో ఆలస్యమైపోయింది. వెంటనే బైలుదేరి వస్తున్నాను" అని ఫోను పెట్టేసింది.

వారం రోజుల కిందట ఒక బార్‌లో పరిచయమైంది ఆ అమ్మాయి. ఏదో ఫైవ్‌స్టార్ హోటల్లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నట్టు చెప్పింది. తనే పలకరించింది ముందు. నాకు గుర్తు రాలేదు. ఒకసారి మా ఇంట్లో జరిగిన ఒక పార్టీకి తను కూడా హాజరైనట్టు చెప్పింది.

"మీ ఆవిడ సంగతేమైనా తెలిసిందా?" అడిగింది.

"లేదు" అన్నాను ముక్తసరిగా.

"ఆ రోజు పార్టీలో బ్రైబల్ డ్రస్‌లో ఎంత అందంగా కనిపించారావిడ! ఇప్పటికీ కళ్ళ ముందు కదులుతున్నట్టే వుంది..." ఇంకా ఏదో చెప్పబోయింది. ఆ సంభాషణని తుంచేస్తూ "కమాన్ లెటస్ హేవ్ సమ్‌థింగ్" అంటూ బెయిటర్ని పిలిచాను. అలా మొదలైన పరిచయం వారం తిరిగే సరికల్లా ఆమె ఈ రాత్రి నాతో గడపడానికి అంగీకరించేటంత దగ్గరికి వచ్చింది.

ఏడాది నుంచి స్త్రీ స్పర్శకు దూరమైనాను. అందమైన ఆడవాళ్ళమీద అసహ్యం చోటుచేసుకుంది నాలో. సౌందర్యంతో మిసమిసలాడే స్త్రీలని చూసినప్పుడు కాటు వేయడానికి సిద్ధంగా వున్న గోధుమ వన్నె తాచుపాములే గుర్తుకి వచ్చి ఒళ్ళు జలదరించేది. కాని ఊర్వశిలో మాత్రం ఏదో విభిన్నమైన ఆకర్షణ గోచరించింది నాకు. ఆమెది పాలరాయి రంగు కాదు కదా చామన ఛాయ కూడా కాదు. నలుపు రంగు. మామూలు నలుపు రంగు కూడా కాదు. అదో అందమైన గాలికి ఎగిరిపోవడానికి సిద్ధంగా వున్న లేత మబ్బు రంగు! అదే నన్నాకర్షించింది. నాలో అణగారిన కోరికల్ని రెచ్చగొట్టింది.

అయితే ఈసారి మోసపోదల్చుకోలేదు. చొక్కా పాంటు విప్పి లుంగీ చుట్టుకున్నాను. వాచీ తీసి టేబిల్ మీద పెట్టాను.

గంట పదకొండు.

ఊర్వశి మరో అర్థగంటలో ఇక్కడికి రావొచ్చు.

బాటిల్లో మిగిలిన విస్కీని గ్లాసులో పోసుకుని నీళ్ళు కలపకుండా అలాగే గుటకేశాను.

సిగరెట్ వెలిగించుకుని మంచం మీద చేరగిలబడి కూర్చున్నాను ఊర్వశి కోసం నిరీక్షిస్తూ...

కరెంటు పోయింది. టేబిలు డ్రాయరు సొరుగులోంచి కేండిల్ తీసి వెలిగించాను.

> "ఈ పని చేసిపెట్టడానికి వంద రూపాయిలు లంచం తీసుకున్నావా?"
>
> "అవును సార్, నన్ను క్షమించండి."
>
> "ఎంత వెధవ పని చేశావు! నీకు బుద్ధి వుందా? ఇంత పెద్ద పనికి కనీసం ఒక వెయ్యి రూపాయిలు తీసుకుని వుండవలసింది."
>
> —పి. విమల

కింద టాక్సీ ఆగిన చప్పుడు.

ఊర్వశి వచ్చినట్టుంది.

కిటికీగుండా రివ్వున వీచిన గాలికి తెరలు రెపరెపలాడినయ్. కేండిల్ ఆరిపోకుండా కిటికీ రెక్కలు మూసివేశాను. అలా మూస్తున్నప్పుడు అప్రయత్నంగా నా చూపులు కింద తోటలో మల్లెపొదల మీద వాలినయ్. ఆ చీకట్లో కూడా ఆ పొదలు కదిలి నన్ను చూసి గలగలమని నవ్వినట్టనిపించింది. చివాల్న కిటికీ రెక్కల్ని మూసి వచ్చి కూర్చున్నాను.

మెట్ల మీద అడుగుల సవ్వడి.

గది లోపలికి వచ్చింది.

ఎంతో పరిచయమున్నదానిలా తలుపుమూసి గడియ పెట్టింది.

"నా కోసం నిరీక్షిస్తూ కూర్చున్నారా? కోపం వచ్చిందా?"

మంచం దగ్గరికి నడిచి వచ్చి చీర విప్పి మంచం మీద పడేసింది.

ఉలిక్కిపడ్డాను. మందంగా వెలిగే కొవ్వొత్తి వెలుతురులో కూడా స్పష్టంగా కనిపించింది!

అదే రంగు!... అదే చీర...!

"ఈ చీర... ఈ చీర...?"

"గుర్తులేదా? ఆ రోజు కూడా ఇదే కట్టుకున్నాను."

అప్పుడు చూశాను ఆమె శరీరం మీద రవికె లేదు. ఎప్పుడు తీసేసిందో మంచం అంచు మీద సరిగ్గా అదే చోట పడి వుంది!

ఫ్యాన్ లేకపోయినా ఆమె ముంగురులు అందంగ లేచి పడుతున్నాయి.

గోడకి తగిలించి వున్న డేట్ కేలెండర్ దగ్గరికి నడిచింది.

"తేదీ సరిగ్గానే వుంది. కాని ఇదేమిటి! సంవత్సరం మార్చనేలేదు" అంది.

అప్పుడు చూశాను.

డిసెంబర్ తొమ్మిది! అంటే ఈ రోజుకి సరిగ్గా ఏడాది! నేనిన్నాళ్ళూ గమనించనే లేదు. సంవత్సరం మార్చి వచ్చి "నేనుంటే ఇలా జరుగుతుందా? ఇంత పరధ్యానంగా వుండనిస్తానా?" అంటూ మంచం దగ్గరికి నడిచి వచ్చింది.

అదే నడక!

గోడ మీద వింతగా కదిలిన ఆమె నీడ ఒక్క క్షణం నన్ను భయపెట్టింది.

"ఉక్కపోస్తున్నది. కిటికీ తలుపులు తెరవకూడదా?" అంది మంచం మీద వెల్లికిలా పడుకుని.

"కేండిల్ ఆరిపోతుంది" అన్నాను.

"ఏం? చీకట్లో అయితే బాగుండదా?" అని గలగల నవ్వింది.

"అలా నవ్వకు" అరిచాను.

మళ్ళీ నవ్వింది.

మల్లెపొదలు వాన చినుకులకు కదిలినట్టుంది ఆ నవ్వు.

"నవ్వితేనే భయమా? రా" అంటూ నన్ను తన మీదికి లాక్కుంది.

ఆమె చేతులు నా వీపుని నిమురుతున్నాయి. ఆమె చేతి వేళ్ళు నా చేతివేళ్ళని నొక్కుతున్నాయి.

"మీ చేతులేమిటి ఇంత గరుకుగా మట్టి తవ్వే చేతుల్లా వున్నాయి?"

అదిరిపడ్డాను ఆ మాటలకి.

నా చేతిని కిందికి, ఇంకా కిందికి జరుపుతున్నది. పొట్ట మీదకి జరిపి మెల్లగా అదుముకున్నది.

మూడో నెల... తగిలీ తగలని ఎత్తులు...!

"ఏమిటిది?" కేకపెట్టినంత పని చేసి చేతిని వెనక్కి లాగేసుకున్నాను.

"ఏం చేశానని! ఎందుకంత కోపం?" అంటూ నా ముఖాన్ని చేతుల్తో తడిమి ముద్దులాడింది.

ఆ నోరు మట్టి వాసన! వర్షంలో తడిసిన మట్టి వాసన! నా చెంపల్ని నిమురుతూ చేతుల్ని కిందికి జార్చింది. ఆ వ్రేళ్ళు నా మెడ చుట్టూ నాట్యం చేస్తున్నాయి.

"పక్క మీద మల్లెలు పరిచారా ఏమిటి? గుబాళిస్తున్నాయి" అంది నవ్వుతూ. అదే నవ్వు! బాగా పరిచయమైన నవ్వు! నా శరీరం ఒక్కసారి జలదరించింది.

"నీ ఒళ్ళు మట్టి వాసన వేస్తున్నదేమిటి?" నా గొంతు నాకే వింతగా ధ్వనించింది.

"మట్టిలోంచి మట్టిలోకి. తెలీదా?" అంటూ నా మెడ చుట్టూ చేతులు బిగించింది. కొవ్వొత్తి కాలి కరిగిపోయింది.

గది నిండా చీకటి.

"మన అబ్బాయి మల్లెపొదల కింద ఆడుకుంటున్నాడు. చూస్తావా?"

"ఏమిటి... ఏమిటి అంటున్నావ్?"

"ఏమీ లేదు."

నివ్వెరపోయి ఆమె కళ్ళలోకి చూశాను. ఆ చీకట్లో కూడా ఆ కళ్ళు మెరుస్తున్నాయి.

అవే కళ్ళు...!

వాటిలో కదలాడే నీలినీడలు — నాకు బాగా పరిచయమైన అవే నీలినీడలు!

నా శరీరం వింత భయంతో మంచుగడ్డలా అయిపోతున్నది. గింజుకోబోయాను. సాధ్యంకావడం లేదు.

నా మెడ చుట్టూ చేతులు బలంగా, ఇంకా బలంగా బిగుసుకుంటున్నాయి.

నాకు ఊపిరాడ్డం లేదు.

సర్వశక్తుల్నీ కూడదీసుకుని "ఎవరు నువ్వు?" అని మాత్రం అనగలిగాను. నా శరీరం అనంతవాయువుల్లోకి ఎగిరిపోతున్నట్టుగా వుంది.

ఏ దూర తీరాల నుంచో వినవచ్చినట్టుగా "నేనే..." అని మాత్రం వినిపించింది. ●